ఆమె పేరు ఆలోచన—
అందానికి ప్రతిరూపం ఆలోచన—
ఆమె నవ్విందంటే నవరత్నాలు కురుస్తాయి...
మాట్లాడిందంటే మందాకినీ ప్రవాహమే...

ఆలోచన పరిచయం ఓ పెండ్లింట్లో జరిగింది... ఆప్యాయత, ఆత్మీయత ఆమె సొత్తనిపించింది.

ముప్ఫయ్యేళ్ళ వయసున్నా పదహారేళ్ళ అమ్మాయిలా ఉంటుంది. అలా అలంకరించుకొంటుంది.

కొందర్ని చూస్తే ఎదురుగా ఉన్నంత వరకే గుర్తుంటారు—

మరి కొందరు కొంతకాలం గుర్తుంటారు—

ఇంకొందరు ఎంతో కాలం గుర్తుంటారు—

ఆలోచన ఈ మూడవ కోవకు చెందింది. పెండ్లింట్లో కలిసినపుడు ఎన్నెన్నో మాట్లాడింది... మనసులో నిలచిపోయింది.

తన చిన్ననాటి ఆటలు, పాటలు, వివాహం చేసుకున్నాక పొందిన అనుభవాలు, అనుభూతులు, పిల్లలతో కాలక్షేపం—కొత్త పరిచయం అనే ఆలోచన లేకుండా గంగా ప్రవాహంలా మాట్లాడేసింది ఆలోచన...

విచిత్రమనిపించింది. ఆ స్నేహం ఆనందమనిపించింది. నాలుగు రోజులు నాలుగు క్షణాల్లా గడిచాయి...

ఆమెను రోజుకోసారైనా చూడందే నీరసంగా అనిపించసాగింది. ఆలోచన నిరంతరాలోచనైంది. ఆమె సంసారం నేనున్న ఊరికి కాస్తదూరంలోనే మరో గ్రామం. ఆ మధ్య ఒకటి రెండు సార్లు వెళ్ళొచ్చినా మనసెందుకో అటువైపే...

నా మనసుకు ఈ ఆలోచన ఒక్కోసారి సిగ్గు కలిగించేది. పిచ్చిపట్ట లేదుకదా అనిపించేది. నాకన్న వయస్సులో, అనుభవంలో పెద్దది.

అయినా ఇదేం ఆలోచన!

నేను చేస్తున్న ఉద్యోగం మీద మనసు నిలచేది కాదు...

ఆమెను చూడాలి...

మాట్లాడాలనే తపన...

నేనా బ్రహ్మచారిని. గది—ఉద్యోగం...

పొద్దు పోయేది కాదు. అందుకే ఆలోచన గురించి ఆలోచన అనిపించేది.

అనుకోకుండా తరవాత రెండు మూడు సార్లు బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు మరో బస్సులో కన్పించింది. వెధవ బస్సులు... ఆ సమయంలో చెడిపోనైనా చెడవు... ఎక్కళ్ళేని తొందర. వెంటనే వెళ్లిపోవడం. ధరఖర్వాటుడనే పద్యం గుర్తొచ్చేది...

ఆవేళ ఆలోచనకు ఒక జాబు వ్రాద్దామని కాయితం, కలం తీసుకున్నాను. ప్రియమైన ఆలోచనకు—ఈ సంబోధన రియాక్షన్ కలిగిస్తోందని కొట్టేసి, ఆలోచన గారికి అని సంబోధిస్తూ, ఆమె పరిచయం ఒక భాగ్యంగా, ఆమె దర్శనం ఒక మధురానుభూతిగా ఆమెతో సంభాషణ చిరస్మరణీయం అంటూ నాలుగు పేజీలతో వ్రాశాను. పోస్ట్‌లో వేద్దామన్న నా ఆలోచనకు అడ్డుకట్టు పడింది. ఖర్మగాలి ఈ జాబు ఆమె భర్త చేతిలో పడితే...? ఆలోచించలేకపోయాను. జాబు చించివేశాను.

మరో రోజు కలలో ఆలోచన దర్శనమిచ్చింది. ఆమె నన్ను చూస్తూనే నవ్వింది. పలుకరించిన నా వైపు అదోలా చూసింది. ఆమెను సమీపించబోతుంటే ఆమె దూరంగా వెనక్కి వెనక్కి పోతూ కన్పిస్తుంది. అలా పోతూ పోతూ చూస్తుండగానే కన్పించకుండా పోయింది. కళ్ళు తెరిచాను. గదిలో బల్బు వెలుగుతోంది. నిశ్శబ్దం తాండవం చేస్తుంది. లెటార్చి పడుకున్నాను.

రోజు రోజుకు ఆలోచన ఆలోచనే నా ఉద్యోగం అయినట్లు తోచింది. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే?... కాస్త భయంవేసింది. ఛీ! నా మనసు ఎవరికైనా చెబితేనే కదా తెలవాల్సింది. ఈ విషయం ఆలోచనకే తప్ప మరెవ్వరికీ తెలియనివ్వను... అలా నిర్ణయించుకున్నాక కాస్త నిబ్బరం కలిగింది.

ఇంతకీ ఆలోచనను నేను ప్రేమించడం లేదు కదా అన్న సందేహం వేసింది. నిజానికి పిరికివాళ్ళు ప్రేమించలేరు. ప్రేమించినా ఆ ప్రేమ సఫలం కాదు. కాబట్టి నాది ప్రేమ అనడం కన్నా సౌందర్యోపాసన అనడం సబబనిపించింది. మరో నిజమేంటంటే కళా హృదయాన్ని అర్థం చేసుకోవాలంటే కళాహృదయమున్న వాళ్ళకే అది సాధ్యమనిపించింది. మరి ఆలోచన ఈ విషయం తెలుసుకుంటే నాతో స్నేహం ఇలాగే కొనసాగిస్తుందా? సౌందర్యోపాసన ముసుగు నీడలో ఉన్న కామరూపి అంటుందా?

ఏమైనా సరే! ఆమె ఉన్న గ్రామానికి వెళ్ళాలి. ఆమెను చూడాలి. మాట్లాడాలి. అదీ నా చివరి నిర్ణయమైంది.

రెండ్రోజులు సెలవు పెట్టి ప్రయాణమయ్యాను.

బస్సయితే ఎక్కాను.

కానీ, సంకోచం...చాలా రోజుల తరువాత నన్ను చూసి అకస్మాత్తుగా అలా రావడం చూసి ఆమె ఏమనుకుందో...? ఆమె భర్త ఏమైనా అనుకోవడం ...అనడం జరిగితే...??

ఆలోచన...ఆలోచన...నిరంతరాలోచన...

ఇలా లాభంలేదు...మళ్ళీ ఆలోచన...

బస్సు కదిలింది.

నాలో ఆలోచన మొదలైంది...

కండక్టర్ రాగానే, ఆలోచన ఉన్న ఊరికి కాకుండా ప్రక్కనే ఉన్న మరో ఊరికి టికెట్ తీసుకున్నాను.

వేరుగా ఉన్న నా స్నేహితుని దగ్గరికెళితే అతన్ని చూసి చాల్లవుతుంది. అక్కడి నుండి కాస్సేపయ్యాక తిరిగి ప్రయాణమై ఆలోచన ఉన్న ఊర్లో దిగితే, ఎవరైనా అడిగినా, చివరికి ఆలోచన అడిగినా చెప్పొచ్చు—

"నా స్నేహితుని వద్ద పని ఉండింది. వచ్చాను. దారిలోనే కదా మీరున్నది చూచిపోదామని ఇలా దిగాను" అని.

నాకీ ఆలోచన ఇంత అకస్మాత్తుగా రావడం నాకే విచిత్రమైంది—అనుకున్నట్లు మిత్రుడున్న ఊర్లో దిగి అతన్ని కలిశాను.

# ఆమె


**- ఉమ్మేత్తల**



ఆ వేళ అతనక్కడే ఉండమన్నాడు. కాని, ఉండడం కోసం కాదు కదా నేను అక్కడకు చేరింది.

"లేదు భాయ్! అర్జంటుగా నేను వెళ్లాలి. చాలా కాలం తర్వాత రావడంతో దారిలోనే కదాదిగి ఓ మారు నిన్ను చూసి పోదామని వచ్చాను" అన్నాను.

చివరకు అతనికి, మరో మారు వస్తానని చెప్పి



ఒప్పించేసరికి నా తల ప్రాణం తోకకొచ్చింది. మొత్తం మీద ఎలాగో తప్పించుకొని బస్సెక్కాను. అతనికి తెలియకుండా ఆలోచన గ్రామంలో దిగాను.

సాయంకాలం పక్కని పల్లె వాతావరణం...

నన్ను ఆహ్లాదపరచింది ఆ సమయం...

ఈ ప్రకృతి మధ్య ఆలోచన దర్శనం...!

మనసు హాయిగా మారింది...

కోవా బిళ్ళలు తింటున్నట్టు ... వెన్నెల రాత్రుల్లో అమృతం తాగుతున్నట్లు... మైదానంలో పరిస్తున్నట్లు ... దివ్యలోకాల్లో సంచరిస్తున్నట్లు...

బస్సుయితే దిగాను. కానీ ఆలోచన ఉండే ఇల్లు తెలియదు. అటు, ఇటు చూశాను. ఓ అబ్బాయి కన్పించాడు. పిలిచి, ఆలోచన భర్త ఊర్లో ఉండే సంగతి అడిగాను.

"ఆయన వేరే ఊళ్లో ఉద్యోగం చేస్తున్నాడు సార్! వారానికోసారి వస్తుంటారు. మొన్ననే ఆయన ఊరికెళ్లి పోయారు" అన్నాడు.

నాకు ఎవరెస్ట్ శిఖరం అధిరోహించినంత ఆనందమైంది...

సప్త సముద్రాలు ఈది వచ్చినంత సంబరమైంది...

అంటే ...? ఇంట్లో ఆలోచన, ఆమె పిల్లలు...

ఆ ఆలోచనే అందంగా అనిపించింది.

అయితే కాలం క్షణాల్లో దొర్లిపోతుంది.

స్వేచ్ఛగా ఆమెతో మాట్లాడొచ్చు అనిపించింది.

"బాబూ! వాళ్ళిళ్ళు ఎక్కడో కాస్త చూపవూ? నేనీ ఊరికి కొత్త' అన్నాను. ఆ అబ్బాయి ఏ ముఖాన ఉన్నాడో ఏమో —'పదసార్' అన్నాడు. ఆమె ఇంటికి దగ్గరవుతుండే కొద్దీ నాలో ఆలోచనా పరిధి విస్తరించింది. గుండె ఓ వైపు ఏదో అద్భుతాన్ని తిలకించబోతున్న ఆనందం...

మరోవైపు నా ఆలోచనాక్రమం సరైందేనా అనే అనుమానం...

ఆల్జీబ్రా లెక్కలు — అందులో సూత్రాలు, మ్యాట్రిసెస్‌లో ఉండే గుణింత గమ్మత్తు, ఐన్‌స్టయిన్ సాపేక్ష సిద్ధాంతాలు తదితరాలు ఎన్నో అర్థమయివచ్చిన నా బుర్రకి ఆలోచన గురించి చేస్తున్న ఆలోచనలకి పరిష్కారం — నా చర్యల ఫలితం అర్థం కాకుండాపోవడం విచిత్రంగా తోచింది...

"సార్ చూడండి"— అన్న ఆ అబ్బాయి పిలుపుతో తెప్పరిల్లి చూశాను.

"అదిగో ఆ కన్పడే కాంపౌండ్‌లోని రెండో ఇల్లే. నాకు పనుంది. నేను వస్తాను సార్" అన్నాడు.

"మంచిదమ్మా! థాంక్స్! నే వెళ్తాలే" అన్నాను.

అతను వెళ్లిపోయాడు.

నా అడుగులు ముందుకు పడసాగాయి.

గుండె ఓ వైపు గుబులుంటుకుంది...

లక్ష రూపాయిల లాటరీ టికెట్ తీసుకున్నాక డిప్పలో నెంబర్లు తీసేప్పుడు వేచి చూచే పరిస్థితిలా తోచింది...

భూమి నుండి చాలా ఎత్తుగా కట్టి ఉన్న తాడు మీద నడుస్తున్న భావన...

పరీక్ష వ్రాయడానికి వెళ్తున్న సమయంలో మనసు చేసే దోలన. సువర్ణ మణిమయ కాంతులు సాగుతున్నట్లు... అంతలోనే కీకారణ్యంలో నడుస్తున్నట్లు...

ఆలోచన దర్శనం ఇంకాస్సేపట్లో అనే సంబరం మరో వైపు... త్రిలోక సంచారం చేసి వచ్చినంత సంతోషం ఇంకోవైపు కలిగాయి... గేటు తెరచి లోనికెళ్ళాను.

కాలింగ్ బెల్ కన్పడింది.

నొక్కాను...వాకిలి తెరచుకొంది.

"ఎవరు కావాలండి?" మధురంగా పలికింది ఓ కంఠం.

ఆలోచనేమోని చూశాను...కాదు...

"ఆలోచన గారున్నారాండి?" అడిగాను.

"ఆలోచనగారా? లేరే! వాళ్ళాయనకి ఇక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ అయిందని, ఆమె, భర్త, పిల్లలు మొన్ననే ఈ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారండి. నిన్ననే కొత్తగా మేం ఈ ఇంట్లో చేరాం" అంది గుక్క తిప్పకోకుండా

"అలాగా! ఏ వూరికి ట్రాన్స్‌ఫర్ అయిందండి?" వెంటనే అడిగాను.

"అదేదో పల్లె పేరు చెప్పారు. జ్ఞాపకం రావడం లేదండి. ఇంతకీ మీరెవరో..."

"ఆమెకు కావలసినవాణ్ణి... బంధువుని" అన్నాను. కరక్కాయ నమిలినంతనిపించి.

"కూచుంటారా...మంచినీళ్ళేమైనా కావాలా?" గౌరవంగా అందామె.

"నో! థేంక్సండి... వస్తానండి" అంటూ వెనుదిరిగి బస్ స్టాప్ వైపు నడిచాను.

అప్పటికే సూర్యుడూ వృద్ధుడై ఆలోచనలతో చాలా భాగం కుంగిపోయి కనిపించాడు. ●

## హోం ఎడ్యుకేషన్

"మేడమ్! పిల్లలకి 'సెక్స్-ఎడ్యుకేషన్' అవసరమంటారా?" అడిగాడు విలేకరి.

"అవసరమే కానీ 'హోం వర్క్' మాత్రం ఇవ్వకూడదు" నవ్వుతూ చెప్పింది.

—ఎ.వి.ఆర్. ప్రసాద్, వెల్లూరు.

* * *